క్లుప్తంగా

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేత



వీపనగండ్ల: మండల కేంద్రంలోని ఇద్దరు అనారోగ్యానికి గురికాగా.. ఆస్పత్రి ఖర్చుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వచ్చిన ఆర్థికసాయానికి సంబంధించిన చెక్కులను సోమవారం గ్రామంలోని మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. దేశమోని సత్యనారాయణకు రూ.33,500, ఉదిత రాములమ్మకు రూ.19వేల చెక్కులను వారు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు ఇంద్రకంటి వెంకటేష్, మాజీ సర్పంచ్ పందెం విజయభాస్కర్‌రెడ్డి, పార్టీ నాయకులు శివారెడ్డి, రాములు, మీసాల మోహన్, జంగ శ్రీను, వెంకటస్వామిగౌడ్, రామన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన



అమరచింత: వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ సోమవారం ముస్లింలు నల్లబ్యాడ్జీలు, ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మొండి వైఖరిని ఖండిస్తూ నినాదాలు చేశారు. దేశంలో నివసించే స్వేచ్ఛ ప్రతి ఒక్కరికి ఉందని, మతాలకు సంబంధించి ఆస్తులను పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కలాం, ఖదీర్, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రం నిరుపయోగం



వనపర్తి రూరల్: మండలంలోని రాజనగరం గ్రామంలో నూతన ఆరోగ్య ఉప కేంద్రం భవన నిర్మాణం పూర్తి చేసుకొని ఏడాది గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోలేదు. ప్రస్తుతం గ్రామంలోని పంచాయతీ భవనంలోనే కొనసాగుతుంది. నూతన భవనం నిరుపయోగంగా మారడంతో వినియోగంలో లేకపోవడంతో భవనం శిథిలావస్థకు చేరుతోంది. అధికారులు స్పందించి నూతన భవనం ప్రారంభించి వినియోగంలోకి తేవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బార్ అసోసియేషన్ లైబ్రరీ సెక్రెటరీకి సన్మానం



కొత్తకోట రూరల్: జిల్లా బార్ అసోసియేషన్ లైబ్రరీ సెక్రెటరీగా ఏకగ్రీవంగా ఎన్నికైన కొత్తకోట పట్టణ కేంద్రానికి చెందిన న్యాయవాది యాదగిరిని ఛత్రపతి వాకింగ్ గ్రూప్ సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. రానున్న రోజుల్లో మరెన్నో ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్టార్ ఆంజనేయులు, యాదయ్యసాగర్, రవి సాగర్, రాజుయాదవ్, భాస్కర్, సి.రవి, రవిందర్‌గౌడ్, దస్తగిరి, వేణు, నాగరాజు, నగేష్‌యాదవ్, రవి, శంకర్, యాది, అంజి తదితరులు ఉన్నారు.

మీసేవ కేంద్రం ప్రారంభం

దేవరకద్ర: మండల కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలో నూతన భవనంలో ఏర్పాటు చేసిన మీసేవ కేంద్రాన్ని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. మీసేవ కేంద్రాల ద్వారా ప్రజలకు సేవలు అందించాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో నాయకులు అంజిల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, కోనరాజశేఖర్, బాలస్వామి, గోవర్ధన్‌రెడ్డి, రాంపాండు, జవహర్, ఆదిహన్మంతరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

ఎర్రవల్లి: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు పరమశివుడికి అభిషేకాలు చేశారు. చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.





కొత్తకోటలో ముస్లింలతో ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి



మదనాపురంలో..



కల్వరాలలో..

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

సాక్షి, నెట్‌వర్క్: కులమతాలకు అతీతంగా అందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీధర్ అన్నారు. సోమవారం జిల్లావ్యాప్తంగా ముస్లింలు భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మరణించిన తమ కుటుంబ సభ్యుల సమాధుల వద్దకు వెళ్లి నివాళులర్పించారు. మౌలానాలు దివ్య ఖురాన్‌లో అల్లా ప్రబోధించిన సూక్తులను చదివి వినిపించారు. పేదల పట్ల ప్రేమ, కరుణ కలిగి ఉండాలని సూచించారు. ఏడాదిలో సంపాదించిన సంపాదనలో పదో వంతును నిరుపేదలు, నిస్సహాయకులకు అందించాలని కోరారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీ ప్రతినిధులు ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజ్ గౌడ్, మాజీ జెడ్పీటీసీలు రవీందర్‌రెడ్డి, రాజేందర్‌సింగ్, డా.పగిడాల శ్రీనివాసులు, రాముయాదవ్, కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్, క్యామ రాజు, విజయ్‌కుమార్, రాజేష్, సాయి ప్రణీత్, చంద్రకాంత్, ఎస్‌ఐ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అమరచింతలో ముస్లింలతో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



ఆత్మకూర్‌లో..



అమడబాకులలో..



ఖిల్లాఘనపురంలో..



పాన్‌గల్ ఈద్గా వద్ద..

సింగంపేటలో తాగునీటి పునరుద్ధరణ



అమరచింత: మండలంలోని సింగంపేటలో నిరంతరం తాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు మిషన్ భగీరథ ఈఈ మేఘారెడ్డి తెలిపారు. 'సాక్షి' దినపత్రికలో సోమవారం సింగంపేటలో తాగునీటి ఎద్దడి అనే కథనంతో వార్త ప్రచురితం కావడంపై ఈఈ స్పందించారు. ఈమేరకు ఏఈ తో మాట్లాడి తాగునీటి సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకున్నారు. వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

మానవపాడు: మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్ల వద్ద ఎస్‌ఐ చంద్రకాంత్ ఆధ్వర్యంలో సోమవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వాహన దారులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యం తాగి వాహనం నడిపిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.25వేలు

మిడ్జిల్: మండల కేంద్రంలోని వాడిక వేంకటేశ్వర స్వామి హుండీని సోమవారం లెక్కించగా రూ.25,678 ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆరు నెలల హుండీని లెక్కించినట్లు తెలిపారు. కార్యక్రమం లో గ్రామపెద్దలు రాజేశ్వర్, బంగారు, తిరుపతి, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డుకు మోక్షమెప్పుడో?

- ఏళ్లు గడుస్తున్నా బెక్కెం ప్రజలకు తీరని కల



కంకర పరిచి వదిలేసిన బెక్కెం రోడ్డు

చిన్నంబావి: ప్రభుత్వాలు మారుతున్నా బెక్కెం ప్రజల కష్టాలు మాత్రం తీరడం లేదు. పెబ్బేరు–కొల్లాపూర్ ప్రధాన రోడ్డుకు చేరుకోవాలంటే ప్రజలు నరకయాతన పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. గ్రామ ప్రజలు, వాహనదారులు తమ చిరకాల కల నేరవేరుతుందని గుంతలు, గతుకుల రోడ్డుకు మోక్షం లభిస్తుందని సంతోషించారు. కానీ పనులు ప్రారంభమయిన కొద్ది రోజులకే రోడ్డును తవ్వి కంకర పరచి సదరు కాంట్రాక్టర్ పనులను మధ్యలో వదిలేశారు.

కంకరపరిచిన రోడ్డుపై ప్రమాదాలు

రోడ్డును తవ్వి కంకర, డస్ట్ వేసి అసంపూర్తిగా వదిలేయడంతో దుమ్ము, ధూళితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారిపై స్థానిక ప్రజలు నడవలేక అటు వాహనాలు వెళ్లలేక అవస్థలు పడుతున్నారు. కంకర తేలడంతో ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు.

ఏళ్లుగా ఎదురు చూస్తున్నాం



ఎన్నో ఏళ్లుగా బెక్కెం రోడ్డు కోసం ఎదురుచూస్తున్నాం. ఈ రోడ్డు పూర్తయితే పెబ్బేరు, కొల్లాపూర్ ప్రధాన రోడ్డుకు చేరుకుంటాం. గతంలో ప్రారంభించిన పనులు మధ్యలోనే వదిలేయడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మంత్రి జూపల్లి ప్రత్యేక దృష్టితో రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తే బాగుటుంది.

– అశోక్‌గౌడ్, బెక్కెం గ్రామం

ఆకట్టుకున్న ట్రాక్టర్ రివర్స్ గేర్ పోటీలు

అమరచింత: పట్టణంలో సోమవారం నిర్వహించిన ట్రాక్టర్ రివర్స్‌గేర్ పోటీలు చూపరులను ఆకట్టుకున్నాయి. శ్రీకృష్ణనగర్‌లో ట్రాక్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉగాది పండుగను పురస్కరించుకుని పోటీలను నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ట్రాక్టర్ రివర్స్ గేర్ పోటీలను రాకేష్‌గౌడ్, మంగ అంజి, జింక రవి ప్రారంభించారు. పట్టణానికి చెందిన ట్రాక్టర్ యాజమానులు, ఔత్సాహిక డ్రైవర్లు పోటీలో పాల్గొన్నారు. అతి తక్కువ సమయంలో ట్రాక్టర్‌ను రివర్స్‌లో నడిపిన పామిరెడ్డిపల్లికి చెందిన మహేష్ ప్రథమ స్థానంలో నిలిచాడు. అమరచింతకు చెందిన డ్రైవర్ శ్రీను రెండో స్థానంలో, మూడవ స్థానంలో మస్తీపురం గ్రామానికి చెందిన ప్రవీణ్ నిలిచాడు. విజేతలకు రాకేష్ గౌడ్ రూ.5,016, రూ.3,016, రూ.2,016 నగదును అందించారు.



విజేతకు నగదు అందిస్తున్న నిర్వాహకులు

కార్యకర్త కుటుంబానికి మంత్రి పరామర్శ

పెంట్లవెల్లి: మండలంలోని గోపులాపురంలో వారం రోజుల కిందట కాంగ్రెస్ కార్యకర్త చంద్రశేఖర్‌రెడ్డి తండ్రి గోపాల్‌రెడ్డి అనారోగ్యంతో మృతిచెందాడు. సోమవారం నిర్వహించిన దశదిన కార్యక్రమానికి మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో ఆయన వెంట భీంరెడ్డి, గుర్క ఆంజనేయులు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పురాతన బావులను పరిరక్షించాలి



గద్వాల: సంస్థానదీశుల కాలంలో నిర్మించిన పురాతన బావులను కబ్జా నుంచి కాపాడాలని, అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. సోమవారం మాజీ మున్సిపల్ చైర్మన్ కేశవ్‌తో కలిసి కలెక్టరేట్‌లో కలెక్టర్ బీఎం సంతోష్‌కు వినతిపత్రం అందించారు. అనంతరరం విలేకర్లతో మాట్లాడుతూ.. గద్వాలలో ప్రభుత్వ భూములు కొందరు అక్రమ మార్గంలో కబ్జాచేస్తున్నారన్నారు. చింతలపేటలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న కొత్తబావిని కబ్జా చేట్టినట్లు తెలిపారు. దీని వెనుక కాంగ్రెస్‌కు చెందిన బడాబాబులు ఉన్నారని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో కొత్తబావిని సంరక్షించాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ కాదాయే!



రూ.2లక్షలకు పైగా ఉన్న రుణాలు మాఫీ చేయాలని పీఏసీఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డికి వినతి పత్రం అందిస్తున్న రైతులు(ఫైల్)

- మాఫీ కోసం రైతన్నల ఎదురుచూపులు
- వివిధ కారణాలతో అందని రుణమాఫీ
- రూ.2 లక్షలకు పైగా ఉన్న రైతుల్లో ఆందోళన

మానవపాడు: అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తామన్న హామీని ఇంత వరకు పూర్తిస్థాయిలో అమలు చేయలేదు. వివిధ కారణాలతో రూ. లక్షలోపు రుణమాఫీ కాని రైతులు దాదాపు జిల్లా వ్యాప్తంగా ఉన్న 13 మండలాల్లోని ప్రతి మండలంలో 30 శాతం మంది రైతులు పైగానే ఉన్నారు. రూ.2లక్షలు వరకు అరకొరగా రుణమాఫీ చేసిన ప్రభుత్వం రూ.2లక్షలకు పైగా రుణం పొందిన వారికి ఎప్పుడు మాఫీ చేస్తారని రైతులు ప్రశ్నిస్తున్నారు. రూ. 2లక్షల వరకే రుణమాఫీ చేస్తారా ఆపైన రుణం ఉన్నవారికి మొండిచేయి చూపిస్తారంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు ఇప్పటికే రుణమాఫీ మొత్తం పూర్తి చేసినట్లు ప్రభుత్వం ప్రకటించడంతో రైతుల్లో ఆందోళన మరింత ఎక్కువై అధికారుల వద్దకు పరుగులు తీస్తున్నారు.

విధివిధానాలేవి..?

ప్రభుత్వం రూ.2 లక్షలకు పైగా రుణమాఫీ సంబంధించి ఎలాంటి విధివిధానాలు ప్రకటించలేదు. రైతులకు సంబంధించి ఉత్తర్వుల్లో ఒకే ఒక అంశాన్ని ప్రస్తావించింది. రూ. 2లక్షలకు పైగా రుణం ఉన్న రైతులు ముందుగా రూ. 2లక్షలకు పైగా ఎంత రుణం ఉందో ఆ మొత్తాన్ని బ్యాంకుల్లో జమచేస్తే ప్రభుత్వం రూ.2 లక్షలు జమ చేస్తుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో రూ.2 లక్షల రుణం ఉన్నవారు రుణం ఎలా చెల్లించాలి.. బ్యాంకుల్లో, ఆధార్ కార్డులో పేర్లలో తప్పులు ఉన్నా వారి రుణాలు ఏ విధంగా, ఎప్పుడు మాఫీ చేస్తారని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం చూస్తుంటే రుణమాఫీ రైతులకు ఎగవేత ధోరణి కనిసిస్తుందంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆత్మహత్యలే శరణ్యం



అసెంబ్లీ సాక్షిగా రుణ మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ రూ.2 లక్షలకు పైగా ఉన్న రుణాలు ఇంత వరకు చేయలేదు. మిరప పంటవేసి గిట్టుబాటు ధరలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. రుణమాఫీ చేయకుంటే రైతులకు ఆత్మహత్యలే శరణ్యం.

– శంకర్‌గౌడ్ రైతు అమరవాయి

నేరుగా రైతుల ఖాతాల్లో జమ..



ప్రభుత్వం నుంచి రూ.2 లక్షలకు పైగా ఉన్న రుణం మాఫీ చేస్తే నేరుగా రైతుల ఖాతాలో జమ అవుతాయి. రూ.2 లక్షలకు పైగా రుణం తీసుకున్న వారి రుణమాఫీ ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంది.

–అయ్యపురెడ్డి
లీడ్ బ్యాంక్ మేనేజర్, గద్వాల

అందని వేతనాలు.. ఆందోళనలో కార్మికులు

- పంచాయతీ సిబ్బందికి నిలిచిన జీతాలు
- అయిదు నెలలుగా నిరీక్షణ
- కార్మికుల ఆందోళన




పనులు చేస్తున్న కార్మికులు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు (ఫైల్)

పెబ్బేరు రూరల్: నిత్యం పారిశుద్ధ్య పనుల్లో నిమగ్నమయ్యే గ్రామ పంచాయతీ కార్మికులకు సకాలంలో జీతాలు అందక అలమటిస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికులకు అండగా ఉంటామని ప్రభుత్వం భరోసా ఇచ్చినా.. ప్రస్తుత పరిస్థితులు దానికి భిన్నంగా ఉన్నాయి. అయిదు నెలలుగా ప్రభుత్వం వారిని పట్టించుకోకపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. గ్రామపంచాయతీ అధికారులు కార్మికులకు సంబంధించిన జీతాల చెక్కులను సకాలంలోనే ట్రెజరీకి పంపినా వేతనాలు విడుదలలో జాప్యం జరుగుతోంది. తమకు వచ్చే జీతంమే అరకొర అంటే.. అది కూడా సక్రమంగా చెల్లించడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పు చేసి కుటుంబ పోషణ చేస్తున్నామని వాపోతున్నారు. తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ), సీపీఐ (ఎంఎల్)మాస్‌లైన్ ఆధ్వర్యంలో కార్మికులు ఇటీవల వేతనాల కోసం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి, జిల్లా అధికారులకు వినతిపత్రం అందజేసినా ఫలితం లేకపోయింది. వనపర్తి మండలంలోని గ్రామ పంచాయతీ పరిధిలో 92 మంది మల్టీపర్పస్ వర్కర్లు పనిచేస్తున్నారు. గ్రామాల్లో పేరుకుపోయిన చెత్త, డ్రెయినేజీల నిర్వహణ, హరితహారం మొక్కలు, పాఠశాలల్లో పరిశుభ్రత, ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ, విద్యుద్దీపాలు, తాగునీటి సరఫరా, ట్రాక్టర్ల నిర్వహణ తదితర విభాగాల్లో పనులు చేస్తున్నారు. పంచాయతీల్లో ఒక్కో కార్మికుడికి రూ.9,500 చొప్పున వేతనం చెల్లిస్తున్నారు. బడ్జెట్ ఉన్న గ్రామ పంచాయతీల్లో కొందరికి జీతాలు చెల్లిస్తున్నారు. కానీ చిన్న జీపీల్లో బడ్జెట్ లేక అయిదు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని కార్మికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.


భారంగా కుటుంబ పోషణ



నెలవారీగా వేతనాలు రాక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం. నెలవారీ జీతంపైనే ఆధారపడి తమలాంటి వారికి కుటుంబ పోషణ భారంగా మారుతోంది. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి. కార్మికులకు కనీస వేతనంతో పాటు అలవెన్స్‌లు చెల్లించాలి. ప్రభుత్వం స్పందించి వెంటనే వేతనాలు విడుదల చేయాలి.

– ఏదుట్ల కురుమయ్య,
జిల్లా అధ్యక్షుడు, పారిశుద్ధ్య కార్మికుల సంఘం

అప్పులు చేసి..



గ్రామ పంచాయతీ కార్మికులకు అయిదు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో అప్పులు చేసి కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. కార్మికులకు ఇవ్వాల్సిన బకాయి వేతనాలు వెంటనే విడుదల చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తాం. ఇటీవల కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసినా ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోంది.

– బోయిన్‌పల్లి గణేష్,
సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి

క్రీడలతో మానసికోల్లాసం



విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న మాజీ ఎంపీపీ మన్నెపురెడ్డి

కొత్తకోట రూరల్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని మాజీ ఎంపీపీ మన్నెపురెడ్డి అన్నారు. ఉగాది పండుగను పురస్కరించుకొని పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లిలో నిర్వహించిన పీపీఎల్ 7 సీజన్ క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. విజేతగా నిలిచిన పీఆర్‌పీ వారియర్స్ జట్టుకు రూ.20వేలు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, రన్నరప్‌గా నిలిచిన హనుమాన్ జట్టుకు మాజీ ఎంపీపీ మన్నెపురెడ్డి రూ.10వేలు, మూడో స్థానంలో నిలిచిన పీఆర్‌పీ రివేంజర్స్ జట్టుకు మన్నెపురెడ్డి రూ.5వేలు అందించగా.. షీల్డ్‌లను మాజీ ఉప సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ మెలుగుతూ ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నిర్వాహకులు యాదగిరిగౌడ్, శివాజీరావు, బీరయ్య, మహేష్, ఆసీఫ్, భాస్కర్, బీఆర్‌ఎస్ నాయకులు లక్ష్మణ్‌గౌడ్, నాగేందర్‌రావు, నాగిరెడ్డి, రవి చందర్‌రావు, ప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.